క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

జియ్యమ్మవలస: మండలంలోని 31 గ్రామపంచాయతీలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏఈ బడే శ్రీనివాసనాయుడు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: మండలంలోని బాలేరుకు చెందిన వృద్ధురాలు మలగాం వరలక్ష్మి(70) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆమె కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. ఆమె కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

రామచంద్రప్రభో పాహిమాం



రెండో రోజు పూజల్లో పాల్గొన్న దంపతులు

వీరఘట్టం: రామచంద్రప్రభో పాహిమాం అంటూ శరణు ఘోషతో భక్తులు శ్రీరామచంద్రమూర్తిని కొలిచారు. మండలంలోని బూరుగ గ్రామంలో రామాలయం ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా సర్వాజోశ్యుల సతీష్‌శర్మ, రమేష్ శర్మల ఆధ్వర్యంలో శుక్రవారం రెండవ రోజు సీతారాములకు 250 మంది దంపతులు కుంకుమ పూజలు చేశారు. సహస్ర నామార్చనలు, నారికేళభిషేకాలతో గోపుర శిఖరంలో అలంకరించబోయే కళశానికి అభిషేకాలు చేశారు.

అప్రమత్తంగా వ్యవహరించాలి



ఎన్నికల విధుల నిర్వహణపై సూచనలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమణ

కురుపాం: ఎన్నికల విధుల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.వి.రమణ సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఎన్నికల పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు ఇస్తున్న శిక్షణలో శుక్రవారం పాల్గొన్న ఆయన మూడు విడతలుగా ఇచ్చే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని, ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. శిక్షణలో తెలిపే ప్రతీ అంశం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు.

వాహన తనిఖీలు



చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న సాయుధ బలగాలు

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పాలకొండ - శ్రీకాకుళం రహదారిలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టును సీతంపేట రోడ్డులో గల వెలగవాడ వద్దకు మార్పు చేసినట్లు ఎస్‌ఐ ఎస్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం సదరు చెక్‌పోస్టు వద్ద ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు. ఇటీవల శ్రీకాకుళం రహదారిలో కారులో తరలిపోతున్న దాదాపు కేజీ బంగారు ఆభరణాలను ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సీజ్ చేసిన నేపథ్యంలో తనిఖీలు మరింత పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిబంధనల మేరకు నగదు, ఆభరణాలు తీసుకువెళ్లాలని, వాటికి సంబంధించిన పూర్తి వివరాలు, ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు తప్పవని సూచించారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

పాలకొండ రూరల్: ఎన్నికల ప్రవర్తన నియమావళిని గ్రామాల్లో కచ్చితంగా అమలు చేయాలని పాలకొండ మండల ఎన్నికల నోడల్ అధికారి రామకృష్ణ స్పష్టం చేశారు. మండలంలోని నవగాం గ్రామంలో తన సిబ్బందితో కలసి శుక్రవారం ఆయన పర్యటించారు. మండల అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్ అమలు చేస్తున్న తీరుపై ఆరా తీశారు. ముఖ్యంగా ఓటర్లను ప్రలోభ పెట్టే, ప్రశాంత వాతావరణానికి ఇబ్బంది కలిగించే అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. స్నేహ పూర్వక స్థితిలో ఎన్నికలు జరిగేలా ప్రజలు, ఓటర్లు చైతన్యవంతులై మెలిగేలా చూడాలన్నారు. ఎటువంటి ఫిర్యాదులకు తావివ్వకుండా నిష్పక్షపాతంగా అధికారులు వ్యవహరించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం కావాలి



బీజేపురంలో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

- ఎన్నికల ప్రచార సభలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పిలుపు

జియ్యమ్మవలస: రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ గెలుపే మనందరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని బీజేపురం, బొమ్మిక, జియ్యమ్మవలస, డంగబద్ర గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఎమ్మెల్యేకు, పార్టీ పార్వతీపురం మన్య జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి మాట్లాడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, ఆ దిశగా ఆయన పాలన కొనసాగిస్తున్నారన్నారు. అన్ని ప్రాంతాలతో పాటు అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్నదే ఆయన తపన అని, దానికోసం ఆయన అహర్నిశలు శ్రమించారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం తీసుకువచ్చారన్నారు. గ్రామాల్లోని సచివాలయాల ద్వారా ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో ప్రతీ గ్రామంలోని ప్రతీ ఇంటికి మేలు జరిగిందన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని జోష్యం చెప్పారు. ఎమ్మెల్యేగా మరోసారి పోటీ చేస్తున్న తనను, అరకు ఎంపీగా పోటీ చేస్తున్న తనూజారాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని, మనమంతా బాగుండాలంటే మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, వైఎస్సార్ సీపీకి భారీ విజయం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అరకు ఎంపీ అభ్యర్థి జి.తనూజారాణి, పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శెట్టి వినయ్, కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, మాజీ ఎంపీపీ ఇందిరాకుమారి, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, మండల వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, శిఖబడి సర్పంచ్ కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యం

- ట్రాన్స్‌కో డీఈ గోపాలకృష్ణ

వీరఘట్టం: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే తమ లక్ష్యమని పాలకొండ ట్రాన్స్‌కో డీఈ టి.గోపాలకృష్ణ అన్నా రు. రూ.1.20 కోట్లతో ఇటీవల వీరఘట్టం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆధునికీకరణ చేశారు. ఇందులో భాగంగా కొత్తగా ఏర్పాటు చేసిన 5 ఎంవీఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్ ఫార్మర్‌ను శుక్రవారం ట్రాన్స్‌కో అధికారులతో కలసి ఆయన బ్రేక ర్ ఆన్ చేసి ప్రారంభించారు. ఇక మీదట వీరఘట్టం సబ్ స్టేషన్ పరిధిలో లో-ఓల్టేజీ సమస్య ఉండద న్నారు. విద్యుత్ వినియోగం కంటే అధిక సామర్థ్యం గల రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయన్నారు. గత 25 రోజులుగా నిరంతరాయంగా ఈ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ పనులు సకాలంలో జరిగేలా సహకరించిన అధికారులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మీటర్ అండ్ ప్రొడక్షన్ డీఈ సుదర్శన్, ట్రాన్స్‌ఫార్మర్స్ డీఈ రాజశేఖర్, ప్రొడక్షన్ ఏడీఈ యోగేశ్వరరావు, ఏడీఈ మోహన్‌చక్రవర్తి, ఏఈలు డి.బాలాజీ, జగదీశ్వరరావు, జేఈ మురళి తదితరులు పాల్గొన్నారు.



పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌చక్రవర్తి, పక్కనే ఉన్న ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు

పక్కాగా డ్రైడే

గరుగుబిల్లి: దోమల నియంత్రణే లక్ష్యంగా ప్రతీ శుక్రవారం చేపట్టే డ్రైడేను పక్కాగా పాటించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని చినగుడబ గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఆయన డ్రైడే కార్యక్రమ అమలును పరిశీలించారు. ప్రతీ ఇంటి వద్ద ఓ చెత్తబుట్ట ఏర్పాటు చేసుకుని, అందులో చెత్త వేసి, ప్రతిరోజూ ఉదయం ఇంటి వద్దకు వచ్చే గ్రీన్‌అంబాసిడర్‌కు అందించాలని తెలిపారు. ఇంటి ముందు, వెనక, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఎక్కువ కాలం నీరు నిల్వ ఉన్న చోట దోమలు ఎక్కువగా పెరిగేందుకు అవకాశం ఉంటుందని, తద్వారా మలేరియా, డెంగీ జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. వైద్య సిబ్బంది కూడా ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వే చేపట్టి, జ్వరాలతో బాధపడే వారిని గుర్తించి, వారికి సకాలంలో వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. ఏఎంవో సూర్యనారాయణ, కార్యదర్శి శిరీష పాల్గొన్నారు.



డ్రైడే కార్యక్రమ నిర్వహణపై సూచనలిస్తున్న డీఎంవో జగన్మోహనరావు

పంచాయతీల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు

పాలకొండ రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధి (జీపీడీపీ) 2024 - 25 జీపీడీపీ ప్రణాళికలు సిద్ధం చేయాలని పాలకొండ ఎంపీడీవో ఎస్.రామకృష్ణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సీతంపేట మండలానికి చెందిన 53 మంది పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ ఎంపీడీవో సమక్షంలో శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీలు సత్యం, కె.సూర్యనారాయణ తదితరులు మాట్లాడుతూ కార్యదర్శులు ఇది వరకే అందించిన ప్రణాళికల్లో స్వల్ప తప్పిదాలు దొర్లాయన్నారు. వాటిని సరిచేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రీన్ అంబాసిడర్ల జీతాలు, జాతీయ ఉపాధి హామీ పనుల వివరాలు, వీధి దీపాల నిర్వహణ ఖర్చులు వంటివి ప్రణాళికల్లో అనుసంధానం చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన శిక్షణ అందించారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో, ఈవోపీఆర్డీలు

వలంటీర్ల రాజీనామా

భామిని: బాలేరు సచివాలయం పరిధిలో 20 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. సచివాలయ కార్యదర్శికి తమ పత్రాలు అందజేశారు. బిల్లుమడకు చెందిన తొమ్మిది మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి అందజేశారు. ఆమె నులకజోడు కార్యదర్శికి వాటిని సమర్పించారు.

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి, ఎం.వి.పురం గ్రామ పంచాయతీలకు చెందిన 24 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామాలు చేశారు. ఆయా సచివాలయాల పరిధిలో ఉన్న పంచాయతీ కార్యదర్శులకు తమ రాజీనామాలు అందజేశారు. తెట్టంగి సచివాలయం పరిధిలో 17 మంది, ఎం.వి.పురం పంచాయతీకి చెందిన 7 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. టీడీపీ కూటమి చేస్తున్న అసత్య ప్రచారాల వల్ల తామంతా రాజీనామాలు చేస్తున్నట్లు వలంటీర్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో మేమంతా జగనన్న వెంటే ఉంటామన్నారు.

సీతంపేట: మండలంలోని పుబ్బాడ గ్రామ సచివాలయం పరిధిలో చిన్నపల్లంకి పంచాయతీకి చెందిన నలుగురు గ్రామ వలంటీర్‌లు శుక్రవారం రాజీనామా చేశారు. తమ రాజీనామ పత్రాన్ని ఎంపీడీవో కె.గీతాంజలికి స్వయంగా అందజేశారు.


గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర గ్రామ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న 17 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఎంపీడీవో పి.సూర్యనారాయణకు వారంతా తమ రాజీనామా పత్రాలను శుక్రవారం అందజేశారు. టీడీపీ నేతలు తమపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ తామంతా స్వచ్ఛందంగా రాజీనామాకు సిద్ధమైనట్లు వారు తెలిపారు. తమపై లేనిపోని నిందలు వేస్తూ ఎన్నికల కమిషన్‌కు టీడీపీ ఫిర్యాదు చేయడం తమను ఎంతగానో బాధించిందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎం.భారతి, ఎ.దుర్గాప్రసాద్, ఎం.శంకరరావు, ఆర్.నిర్మల, ఎం.సింహాచలం, ఎ.నాగార్జున తదితరులు ఉన్నారు.



సీతంపేట: రాజీనామా పత్రాలు ఎంపీడీవోకు అందజేస్తున్న గ్రామ వలంటీర్‌లు



గరుగుబిల్లి: రాజీనామా పత్రాలతో వలంటీర్లు



భామిని: ఎమ్మెల్యే కళావతికి రాజీనామా పత్రాలు సమర్పిస్తున్న బిల్లుమడ వలంటీర్లు



వీరఘట్టం: తెట్టంగి సచివాలయం వద్ద రాజీనామపత్రాలతో వలంటీర్లు

ఓటు నమోదుకు మరో 3 రోజులే గడువు

గుమ్మలక్ష్మీపురం: ఓటు నమోదుకు మరో మూడు రోజులే గడువు ఉందని, అర్హులైన వారంతా త్వరగా ఓటుహక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పి.రామారావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులంతా ఓటరుగా నమోదు కావాలన్నారు. ఈ నెల 15వ తేదీలోగా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లలో దరఖాస్తు చేసుకుని, ఓటుహక్కు పొందవచ్చన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట

గరుగుబిల్లి: మండలంలోని సీతారాంపురం రామాలయంలో సీతారామలక్ష్మణ ఆంజనేయ విగ్రహాలను శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. శనివారం ఆయా విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ చేయనున్నట్లు పురోహితులు మురళీమోహన్‌శర్మ తెలిపారు. సాయంత్రం గ్రామ ప్రదక్షిణ, జలాధివాసం, సర్వదేవత మూలమంత్ర హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పాచిపెంటలో ఫ్లాగ్‌మార్చ్

పాచిపెంట: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పాచిపెంట ఎస్సై నారాయణ ఆధ్వర్యంలో పోలీసులు మండలంలో విస్తృతంగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు, ప్రత్యేక బలగాలతో కలిసి శుక్రవారం పాచిపెంట మండల కేంద్రంలో ఫ్లాగ్‌మార్చ్ చేశారు. ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అందరూ బాధ్యతగా నడుచుకోవాలని ఎస్సై ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి 21న పరీక్ష

మక్కువ: వచ్చే విద్యాసంవత్సరంలో మోడల్‌స్కూల్‌లో ఆరవతరగతిలో విద్యార్థుల ప్రవేశానికి ఈనెల 21న పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ స్వర్ణలత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండలంలోని ములక్కాయవలస మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు హాల్ టిక్కెట్లు జారీ అయినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ప్రవేశ పరీక్షకు హాజరుకావాలని ఆమె కోరారు.

నేడు కురుపాంలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

కురుపాం: మండల కేంద్రంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఉదయం 9 గంటలకు పొడి, ఒప్పంగి, సీడుమానుగూడ, సంతోషిపురం, లండగొర్లిగూడ, రస్తాకుంటుబాయి, తోటగూడ గ్రామాల్లో.. మధ్యాహ్నం తెన్నుఖర్జ, గొటివాడ, సూర్యనగరం, మర్రిగూడ, మంత్రజోల, నేరేడువలస, దురుబిలి గ్రామాల్లో ప్రచారం చేయనున్నారని పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నేతలు, కార్యకర్తలంతా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఎన్నికల సిబ్బంది బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

పాలకొండ : ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది బ్యాలెట్ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ వరహాలు తెలిపారు. ఇప్పటికే ఎన్నికల కోసం సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల విధుల ఆర్డర్‌లు పొందిన వారు తమ కార్యాలయంలో ఆ కాపీని అందించి తమ వివరాలతో బ్యాలెట్ కోసం సంప్రదించాలని సూచించారు. బీఎల్‌ఓలు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితర ఎన్నికల సిబ్బంది దీన్ని వినియోగించుకోవాలని కోరారు.

బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన డీఈవో

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను డీఈవో పగడాలమ్మ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా 6 నుంచి 9వ తరగతి విద్యార్థుల టోఫెల్ జూనియర్ ప్రిపరేటరీ పరీక్ష రాసే తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలు మెరుగుపర్చేందుకు టోఫెల్ పరీక్ష దోహదపడుతుందన్నారు. ఆమె వెంట హెచ్‌ఎం పి.పద్మశ్రీ, హెచ్‌డబ్ల్యూవో పాలక అమల తదితరులు ఉన్నారు.

141 మద్యం సీసాలు స్వాధీనం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాటీశీల గ్రామం వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న 141 మద్యంసీసాలు, ఓ ద్విచక్ర వాహనం, ఓ కారును స్వాధీనం చేసుకున్నామని ఎల్విన్‌పేట ఎస్‌ఐ బి.శివప్రసాద్ తెలిపారు. ఇదే విషయమై శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. కురుపాం మండలంలోని మొండెంఖల్లు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఒడిశాలోని గొట్లభద్ర నుంచి 81 మద్యంసీసాలను ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా పట్టుకుని, కేసు నమోదు చేశామని, అలాగే కురుపాం మండలంలోని అధ్వానంగూడ గ్రామానికి చెందిన మరో వ్యక్తి గొట్లభద్ర నుంచి 60 మద్యంసీసాలను కారులో తరలిస్తుండగా పట్టుబడ్డారు. ఇరువురిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు.

కొమరాడ: మండలంలోని రాజ్యలక్ష్మీపురం గ్రామంలో స్పెషల్ బ్రాంచ్ ఏఎస్‌ఐ శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఓ వ్యక్తి వద్ద అక్రమంగా ఉన్న 46 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

ఇంటర్‌లో సత్తా చాటిన విద్యార్థులు

ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటారు. శుక్రవారం విడుదలైన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో పలువురు విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. వీరికి ఆయా కళాశాలల అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు. – సాక్షి నెట్‌వర్క్



అడ్డాకుల సందీప్, 964, ఒకేషనల్, జీజేసీ, పాలకొండ



లక్ష్మీప్రసన్న, 962, ఎంపీసీ, కేజీబీవీ, కురుపాం



శాంతి కుమారి, 428, బైపీసీ, కేజీబీవీ, మక్కువ



పెన్నింటి సమీరా, 428, బైపీసీ, కేజీబీవీ, గరుగుబిల్లి



ఎస్.కీర్తన, 446/470, కేజీబీవీ,వీరఘట్టం

సత్తా చాటిన గిరిజన గురుకులాలు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో ప్రభుత్వ గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలు ఇంటర్మీడియట్ ఫలితాల్లో శతశాతం ఫలితాలు సాధించాయి. బాలికల కళాశాలలో సెకండియర్‌లో 135 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఫస్టియర్‌లో 166 మందికి 162 మంది పాసయ్యారు. 97 శాతం ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో ఎస్.సుజాత (959), బైపీసీలో ఎస్.జాను (958), హెచ్‌ఈసీలో ఎస్.శృతి(911), వృత్తి విద్యాకోర్సు ఎఅండ్‌టీలో ఎస్.స్రవంతి (956), ఎస్.కీర్తన (956) మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీ ఎస్.దివ్య (454), బైపీసీలో జె.ఈశ్వరమ్మ (423), హెచ్‌ఈసీలో ఆర్.చిన్ని (438) మార్కులు సాధించారు. వొకేషనల్ ఎఅండ్‌టీలో ఎస్.హారిక (483), వి.ఉషారాణి (483) మార్కులు సాధించారు.

- మల్లి ప్రభుత్వ ప్రతిభ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ ఫస్టియర్‌లో 68 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 79 మంది పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. బైపీసీలో శాంతికుమార్ (966) మార్కులు సాధించారు.
- బాలుర గిరిజన గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరంలో 158 మందికి 133 పాసయ్యారు. 84.7 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 150 మంది విద్యార్థులకు గాను 141 పాసయ్యారు. 94 శాతం ఫలితాలు సాధించారు. వృత్తి విద్యాకోర్సుల్లో శతశాతం ఉత్తీర్ణులయ్యారు. బాలుర కళాశాలలో ఫస్టియర్‌లో ఎస్.రమేష్ సీజీఏ గ్రూపులో 469 మార్కులు సాధించారు.



ఎస్. సుజాత



ఎస్.జాను

నర్సిపురంలో ఆరోగ్య సురక్ష

పార్వతీపురంటౌన్: వైద్యాధికారి డాక్టర్ ఎస్.ఎమ్.కె తిరుమలప్రసాద్ అధ్వర్యంలో నర్సిపురం గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, 60 సంవత్సరాలు పైబడిన వారు హాజరు కాగా వారికి వైద్యులు ఆరోగ్య సేవలు అందించారు. వచ్చిన వారి సమస్యలు తెలుసుకుని అవసరమైన వైద్య పరీక్షలు చేసి కావలసిన మందులు ఇచ్చారు. ఈ శిబిరంలో ఎముకలు, చెవి, ముక్కు వైద్యులు, కంటికి సంబంధిచిన వారు అందుబాటులో ఉన్నారు. కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులు, శేషగిరిరావు ఎస్.కోటేశ్వరరావు, సూపర్‌వైజర్ జయగౌడ్, నాగమ్మ, అమరావతి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షలో నేత్ర పరీక్షలు:

ఆరోగ్య సురక్ష శిబిరంలో భాగంగా నేత్ర వైద్య పరీక్షలను కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి నగేష్ రెడ్డి పర్యవేక్షించారు. కంటి వైద్య సహాయకురాలు ఉమామాహేశ్వరి పరీక్షలు నిర్వహించి 3 గురుకి అంతర కుసుమం, ఇద్దరికి కొయ్య కండ, 18 మందికి దృష్టి దోషం ఉన్నట్లు గుర్తించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహిస్తామని, అలాగే దృష్టి దోషం ఉన్న వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తామని, సాధారణ వ్యాధులకు మందులతో చికిత్స అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు కృష్ణవేణి,ఆది లక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీధర్, జయ, నాగమణి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నేత్ర వైద్యసేవలందిస్తున్న డాక్టర్ నగేష్ రెడ్డి

లచ్చయ్యపేటలో జేఏఎస్-2 వైద్యశిబిరం

సీతానగరం: మండలంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్-2) వైద్యశిబిరాలను వ్యాధిగ్రస్తులంతా వినియోగించుకోవాలని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ పి.నిహారిక కోరారు. ఈ మేరకు మండలంలోని లచ్చయ్యపేట పాఠశాల ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2 వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిహారికా మాట్లాడుతూ జేఏఎస్-1 లో గ్రామాల్లో దీర్ఘకాలంగా వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధినిర్ధారించి, నివారణకు అవసరమైన మందులు నెలకు సరిపడా ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ నిహారిక

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు రాజాం

EP 6/2022 in OS 32/1972

DHRS:- కుప్పన్న గారి శ్రీరామమూర్తి (Died) మరియు వగైరాలు
And
JDRs:- పైడి ఆనందరావు (Died) మరియు వగైరాలు

JDRs:- 1. మొదలవలస ఆదిలక్ష్మి, W/o లేటు ఆనందరావు, వయస్సు 61 సంIIలు, వృత్తి: గృహ వృత్తి, తాతవారి స్ట్రీట్, పాలకొండ విలేజ్ మరియు మండలం, శ్రీకాకుళం జిల్లా. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా. JDR No.12

2. రోనంకి వనజ W/o రాధాక్రిష్ణ, వయస్సు 57 సంIIలు, వృత్తి: గృహ వృత్తి, తాతవారి స్ట్రీట్, పాలకొండ విలేజ్ మరియు మండలం, శ్రీకాకుళం జిల్లా. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా. JDR No.13

3. నవ్వారి వశంతకుమారి, W/o ఎస్.వి.ఎస్.ప్రకాశ్, వయస్సు 55 సంIIలు, వృత్తి: గృహ వృత్తి, తాతవారి స్ట్రీట్, పాలకొండ విలేజ్ మరియు మండలం, శ్రీకాకుళం జిల్లా. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా. JDR No.14

పై నెంబరు అమలులో మీ ముగ్గురు ఎన్నిసార్లు కోర్టు వారు EP నోటీసులు పంపినను తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ఈ యొక్క ప్రకటన ద్వారా పై తెలియజేసిన JDRs ముగ్గురు తేది 24.04.2024న అందుపై మీకు ఏవైనా ఆక్షేపణలు ఉన్నయెడల మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని ఉదయం 10:30 నిమిషాలకు తేది 24.04.2024 న కోర్టులో హాజరు కావలెను. లేనియెడల మీపై పరోక్షంగా విచారించి తీర్మానించబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

కె.కొండలరావు, B.Sc, B.L, అడ్వకేటు
రాజాం, సెల్: 9440531061
రాజాం
తేది: 11.04.2024